# పెళ్ళాం ఊరికెళ్ళాలి

-అడబాల అప్పారావు

పెళ్లయి పదేళ్లవుతోంది. ఈ పదేళ్లలో అనేకసార్లు రాజీ పుట్టింటికెళ్లింది. ఎప్పుడు వెళతానన్నా మనస్ఫూర్తిగా ఒప్పుకుంటాడు రఘు. ఆ మరుక్షణమే రాజీలో ఓ నిరుత్సాహం. తనకు వెంటనే ఆశాభంగం.

'ఇదేంటీ? వెళతానని అడిగిన వెంటనే ఒప్పుకుంటే థ్యాంక్స్ చెప్పాల్సింది పోయి అలా మిర్రుమిర్రులాడుతూ చూస్తుందేమిటి 'పెళ్ళి పుస్తకం'లో దివ్యవాణిలాగా!

ఈ ఆడవాళ్ళ మనస్సర్థం చేసుకోవడం బ్రహ్మతరం కూడా కాదేమో' అనుకుని-

"అంతకోపమెందుకూ? వెళ్లడం ఇష్టం లేదా!'' అన్నాడు రఘు.

"అంటే నేనెప్పుడు వెళిపోతానా అని చూస్తున్నారా?'' స్వరం మార్చింది. 'ఆ పప్పులేం ఉడకవు' అన్నది దానర్థం. మళ్ళీ తనే "అంటే నేను ఊరెళ్ళిపోతే అయ్యగారు సినిమాలు, షికార్లూ, ఫ్రెండ్సూ లేటుగా రావడాలూ. ఎప్పుడొచ్చినా ఇంటిదగ్గర అడిగే వాళ్లుండరు కాబట్టి ఆ దర్జా అవీ అన్నీ ఊహించుకుంటుంటేనే అయ్యగారు ఎంత హాయిగా ఉండాలనుకుంటున్నారో అర్థమవుతోంది!'' అంది రాజీ.

ఆ మాటల్లో అంత కాఠిన్యం, ద్వేషం లేకపోయినా తనని మరచిపోయి భర్త తన ఆనందంలో తను మునిగిపోతాడనే కించిత్ అభద్రతాభావం గోచరిస్తోంది.

"నేను వెళ్లడం మీకు ఆనందంగా ఉందా?'' ఉక్రోషంగా అడిగింది రాజీ.

"ఇదెక్కడి గొడవరా బాబూ! వెళతానని నువ్వే కదా అన్నావు. ఓ మంచిభర్తగా దానికి ఓకే అన్నాను''

"అఘోరించారులే. ఎప్పుడైనా వెళతాను అని అన్నప్పుడు రాజీ వెళ్లవద్దు నువ్వులేకుండా నేనుండలేను అని అన్నారా! వెళ్లవద్దని పట్టుపట్టారా!''

రఘుకి నవ్వొస్తోంది. వెళ్లనీయకపోతే తనమీదే నిష్ఠూరం వేస్తుంది.

వెళ్లమని చెప్పినా తనమీదే నిష్ఠూరం వేస్తుంది. ఏం చెయ్యాలో తెలియక ఆలోచనలో పడ్డాడు రఘు.

"నేనెంతకానిదాన్నయి పోయానన్నమాట! పెళ్లయిన కొత్తలో అయితే క్షణం కూడా నిన్ను విడిచి ఉండలేను రాజీ! అన్న మనిషేనా ఈమనిషి'' మిర్రుమిర్రులాడుతూ చూస్తోంది.

"నేను వెళతానంటే అంత ఈజీగా ఎందుకు ఒప్పేసుకుంటున్నారో కాస్త తెలుసుకోవచ్చా!'' అంది వ్యంగ్యంగా.

రఘు కొంచెం టైం తీసుకుని "జీవితంలో పోగొట్టుకున్నది తిరిగి పొందడం కోసం'' ఫిలసాఫికల్‌గా ఫోజుపెట్టి అన్నాడు.

"పెళ్లికాకముందు నేను ఎంతో హాయిగా బ్రతికేవాణ్ణి. జాబ్ చేస్తూ బ్యాచిలర్ రూంలో ఉంటూ ఆఫీస్‌కి సెలవొస్తే మార్నింగ్ బయటపడినవాణ్ణి రాత్రి పదకొండు గంటలకి గానీ ఇంటికి చేరేవాణ్ణి కాదు. రోజంతా సినిమాలూ, షికార్లూ, హోటల్ భోజనం వగైరా! ఓహ్ స్వేచ్ఛా జీవితమంతా బంధనాల్లో చిక్కుకుపోయింది''తనకి తెలుసు ఈమాటలకి రాజీ ఉడుక్కుంటుందని. ఆ ఉడుకుమోత్తనం చూడాలని రఘులో ఓ చిరుకోరిక. ఆ ఉక్రోషంలో ఆమెలో ఓ అందం.

"అంటే నేను లేకపోతే మీరు పోగొట్టుకున్నది ఏదో పొందుతారంటే నేనుండగానే అది పోగొట్టుకున్నారన్నమాట''

"కొంతవరకూ అది కరెక్టేననుకో!''నసిగాడు.

రాజీకి వళ్ళు మండిపోయింది. అసలే ఉడుకుమోతుది. మూతి బిగించి అటు తిరిగింది.

"అయితే నేవెళ్లనే వెళ్లను''

"అంత పనిమాత్రం చెయ్యకు'' తన్నుకొస్తున్న నవ్వును ఆపుకుంటూ అన్నాడు.

"ఏం నావల్ల అంత బాధగా ఉందా అయ్యగారికి'' విసురుగా అటు ఇటూ తిరిగి కొరకొరలాడుతూ చూస్తోంది.

"కొంచెం సుఖంగా కూడా ఉంటుందనుకో! ప్రొద్దున్నే వంటావార్పూ అవీ నావల్లకాదు''

"అయితే నేను ఊరికెళ్లింతర్వాత అయ్యగారు ఎలా ఎంజాయ్ చేస్తారో కాస్త తెలుసుకోవచ్చా!'' కాస్త ఉక్రోషం కలగలిసిన స్వరంతో అడిగింది.

"ఏముందీ ప్రొద్దున్నే లేవడం, స్నానం చేయడం, కాఫీ తాగడం, ఆతర్వాత ఒళ్ళు బద్ధకంగా లేకపోతే వంటచేసుకోవడం, బద్ధకంగా ఉంటే పాలుతోడు పెట్టి ఆఫీసుకెళ్లగానే టిఫిన్ చేసి లంచ్ కూడా క్యాంటీన్‌లో చేసి సాయంత్రం వంట మాత్రం ఇంటిదగ్గర చేసుకోవడం''

"అంటే సాయంత్రం టైంకే ఇంటికి దయచేస్తారన్నమాట''

"ఛఛ! అలవాట్లో పొరపాటు. ఏదో పెళ్లాం ఇంటిదగ్గర ఉన్నట్టు ఆఫీసు అవగానే రావడం దేనికీ! అట్నుంచి అటే సినిమాకి చెక్కేస్తా''

"ఇంట్లో టీవీ ఉండగా సినిమా అంత అవసరమా?''

"అవసరం కాదా మరి! మొన్న సంక్రాంతికి రిలీజైన సినిమాలు ఏ రెండేళ్లకో, మూడేళ్లకో టీవీలో వస్తాయి. అప్పటిదాకా ఎవడు ఆగుతాడు? అసలే ఈ సంక్రాంతికి హిట్ పిక్చర్లు ఎక్కువగా వచ్చినయ్. ఒక్కసినిమాకి వెళదామన్నా నువ్వు వెళ్లనివ్వలేదు. ఇప్పుడు చెబుతా వాటి పని. లేకపోతే ఆ వాల్ పోస్టర్లన్నీ నన్ను చూసి వెక్కిరిస్తాయా! ఇప్పుడు చూడు. ఈ రఘుతో పెట్టుకుంటే అంతే మరి! చిరిగిపోద్ది'' పేట్రేగిపోయాడు.

"ఏంటి సినిమాతెరా!'' వెక్కిరింపుగా అంది రాజీ.

"మరి! అన్నట్టు నీకింకో విషయం చెప్పడం మరిచిపోయాను. మా ఆఫీసులో చిట్టిబాబుగాడికి ప్రమోషనిచ్చిన దగ్గర్నుంచీ నాకు పార్టీ ఇస్తాను రమ్మని ఒకటే చంపేస్తున్నాడు. నువ్వు ఊళ్ళో ఉన్నప్పుడు నేను పార్టీకి వెళ్లలేనని తెలిసే వాడలా రెచ్చిపోయాడు. ఇప్పుడు ఇమ్మంటాను వాణ్ణి పార్టీ. మనదెబ్బకి మొత్తం వాడి జేబు చిల్లు పడాల్సిందే''

రాజీకి వళ్ళు మండిపోయింది. "అంటే మేమెప్పుడు ఇంట్లో లేకుండా పోతామా ఈ జల్సాలన్నీ చేద్దామా అని కాచుక్కూర్చున్నారన్నమాట''

"ఎగ్జాక్ట్‌లీ!''

"సర్లెండి! మా పుట్టింటికి పోతాను. మీరొచ్చి బ్రతిమాలుకుంటేనే మళ్లీ వచ్చేది. పెద్దమీరేనేంటి సుఖంగా ఉండేది. మా పుట్టింట్లో మేము మీకంటే సుఖంగా ఉంటాం. మా సుఖం మాకూ ఉంది''

"ఏంటో అది?''

"ఇక్కడలాగా ప్రొద్దున్నే ఖంగారుగా లేవనక్కర్లేదు. నెమ్మదిగా ఏడింటికి లేస్తే అమ్మ కాఫీ టిఫిన్లు రెడీచేసి పెడుతుంది. స్నానం చేసి హాయిగా టీవీ చూస్తూ తింటాం. ఆ తర్వాత ఊళ్ళో చిన్ననాటి స్నేహితులతో కలిసి కబుర్లు చెప్పుకుంటాం. మా అన్నయ్యలు, వదినలు, బాబాయిలు, బామ్మ అందరం కలిసి హాయిగా గడుపుతాం. ముఖ్యంగా మీకు అన్నీ టైంకి చేసి పెట్టే బాధ తప్పుతుంది.



మేం కూడా ఎంజాయ్ చేస్తామండీ సమ్మర్ వెకేషన్‌లో'' గర్వంగా అంది రాణి.

"అత్త వక్కికోతలు వా అంత ఎంజాయ్‌మెంట్ మీకెక్కడొస్తుందీ!''

"ఏమన్నా సుఖంగానే ఉంటాం మేమక్కడ ఏరా చిన్నా!''

"అవును నాన్న ఒక్కడే ఉండాలిక్కడ షేమ్...షేమ్'' అన్నాడు ఏడేళ్ల కొడుకు సందీప్.

కాలింగ్‌బెల్ మ్రోగింది.

రాజీవెళ్ళి తలుపుతీసింది.

ఎదురుగా పరశురాం. "రా అన్నయ్యా!'' అంటూ ఆప్యాయంగా ఆహ్వానించింది.

పరశురామ్, రఘు చిన్ననాటి స్నేహితులు. ఇద్దరూ ఒకే సిటీలో ఉద్యోగం చేస్తున్నారు.

ఒకరు సిటీలో ఈ మూలైతే ఇంకొకరు ఆ మూల. పేరుకు ఒక ఊరన్న మాటేగానీ సంవత్సరానికి ఒకసారో రెండుసార్లో మాత్రమే కలుసుకోగలిగినంత దూరం ఇద్దరు ఉండేకాలనీలకి.

## ముద్దుపేరు



తారలకి మంచి మంచి నిక్‌నేమ్స్ ఉంటాయి. చిన్నప్పుడు తల్లిదండ్రుల చేత ఫ్రెండ్స్‌చేత టామ్ అని పిలిపించుకునేదిట సోగకళ్ల కాజోల్. 'చిన్నప్పుడు కార్టూన్ ప్రోగ్రాంలు ఎక్కువగా చూసేదాన్ని. మా అక్క తనీషా నన్ను టామ్ అంటే నేను దాన్ని జెర్రీ అనేదాన్ని. మా పేరెంట్స్ మా ఇద్దర్నీ కలిపి టామ్ అండ్ జెర్రీ అనేవారు. ఇప్పుడు ఆరోజుల్ని గుర్తుచేసుకుంటే చాలా హేపీగా ఉంటుంది. ఇప్పుడు పిల్లలు ఈ కార్టూన్ ప్రోగ్రాంని ఎంతగా ఆరాధిస్తున్నారో అందరికీ తెలిసిందే' అంటోంది ఆనందంగా కాజోల్.




కుశల ప్రశ్నలయింతర్వాత "మీ చెల్లాయి ఈ వేసవి సెలవులకి ఊరెళుతోంది రా!'' అన్నాడు రఘు.

"మరి నువ్వు?''

"మనకి శెలవులెక్కడివిరా! ఆఫీసులో అన్నిరోజులు సెలవు దొరకడం కష్టం''

"చూశావా అన్నయ్యా! ఈయనేమంటున్నారో'' అంటూ మొదలుపెట్టి రఘు చెప్పిన ఎంటర్‌టైన్‌మెంట్ షెడ్యూలంతా పరశురామ్‌తో ఏకరువుపెట్టింది రాజీ. పరశురామ్ నవ్వి-

"ఏరా పెళ్లాన్ని ఊరికి పంపించేసి ఎంజాయ్ చేద్దామని ప్లాన్ వేశావన్నమాట. సర్లేరా! నాలుగురోజులు కడుపుమాడేటప్పటికి నీకు తిక్క కుదురుతుంది. నువ్వేం అనుకోకమ్మా! వారం తిరక్కుండా మళ్లీ నీదగ్గరికి పరుగెత్తుకొస్తాడు''

"అంత సులభంగా లొంగే రకంకాదు అన్నయ్యా ఈ మొండిఘటం'' చిరుకోపంగా అంది.

"ఒరేయ్ ఇందాక ఇంకో ముఖ్యమైన ఎంజాయ్‌మెంట్ ఒకటి చెప్పడం మరిచానురా. అదేంటంటే మనం పెళ్లిగాకముందు బ్యాచిలర్ రూమ్‌లో ఉంటూ సెలవుల్లోనూ, ఖాళీ టైంలో ఏం చేసేవాళ్లమో గుర్తుందా?''

"ఏం చేసేవాళ్లం...?''

"సాయంత్రం వేళ అలా ట్యాంక్‌బండ్‌కో, పబ్లిక్‌గార్డెన్‌కో వెళ్ళి షికారు చేస్తూ అమ్మాయిలకు బీట్లేసేవాళ్లమా!''

"ఛ ఊరుకో! ఏం మాటలవి! రాజీ ఏమనుకుంటుంది?''

"రాజీ ఊరువెళ్లింతర్వాత నేను మళ్ళీ బ్యాచిలర్‌నే కదా! అలా సాయంసంధ్యలో ట్యాంక్‌బండూ, లుంబినీ పార్క్ ఎట్‌సెట్రా ఓ రౌండేసి, అమ్మాయిలకి బీట్‌కొట్టి అందమైన జంటలవంక చూస్తూ రోజూకాసేపు ఆస్వాదించి వస్తే...ఆహా! అ మజాయే వేరురా!'' ఊహల్లో తేలిపోతూ చెప్పాడు రఘు.

"ఒరేయ్! ఏంట్రా మళ్ళీ కుర్రాడివైపోయాననుకుంటున్నావా ఏమిటి? ఇప్పుడు మనకు కొన్ని బాధ్యతలు ఉన్నాయి. ఫ్రీగా జాలీగా ఎంజాయ్‌చేసే ఆకతాయి వయసట్రా మనది!''

"ఏంట్రోయ్! ముప్పై అయిదుకే ముసలోడివైపోయావా?''

"అన్నయ్యగారూ! తన సరదాలు మనమెందుకు కాదనాలి! కాస్త నేను తిరిగొచ్చేటప్పటికి ఎవరిచేతో చెప్పుదెబ్బలు తిని మొహానికీ, చేతులకీ,కాళ్లకీ కట్లు వేయించుకుని ఉండకుండా చూస్కోమనండి. అసలే ఆ మొహం కందగడ్డలా ఉంటుంది'' ఉడుక్కుంటూ అంది రాజీ.

* * *

భార్యా ఇద్దరు పిల్లల్ని ట్రైనెక్కించాడు రఘు. గోదావరి ఎక్స్‌ప్రెస్ భారంగా కదిలింది.

రాజీ కిటికీలోంచి రఘువంక చూస్తూనే ఉంది. రఘు టాటా చెబుతూనే ఉన్నాడు కనిపించినంత దూరం. ట్రైన్ కదిలేవరకూ అవీ ఇవీ తిని ఆరోగ్యం పాడుచేసుకోవద్దని రఘుకి జాగ్రత్తలు చెబుతూనే ఉంది రాజీ.

"పిచ్చిమొహం'' అనుకుని తనలో తనే నవ్వుకున్నాడు నిర్లిప్తంగా రఘు.

రాజీ వెళ్ళిపోతుంటే రఘు మనసు ఆర్ద్రమయింది. తను ఓ పట్టాన ఏ విషయానికీ తేలికగా స్పందించే మనిషి కాదు. కంటిలోని ఆర్ద్రతకు రెప్పలు భారంగా మూతపడ్డాయి. గుండె బరువెక్కగా భారంగా శ్వాసపీల్చుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. ఎవరో పేరుమోసిన రచయిత మనుష్యుల మధ్య నుండే సెంటిమెంట్స్‌ను గురించి మాట్లాడే సందర్భంలో అన్నమాటలు గుర్తుకొచ్చాయి.

"భార్యబిడ్డలు ఊరికెళుతుంటే కళ్ళు చెమర్చాలి'' అంటే తను పెళ్లాం

పిల్లల గురించి సహజంగానే స్పందించాడన్నమాట. మరి రాజీ ఏంటీ అలా అంటుంది.

అదే తనకు అంతుపట్టడం లేదు. ఇంట్లో తను ఏకాకినట, తనకు ఎవరూ అక్కరలేదట.

పిల్లల మంచిచెడులు తనకు పట్టవట. ఎంతసేపూ నా పని నాదేనట. అదే టైంకి ఆఫీసుకి వెళ్లడం, వచ్చేటప్పుడు మాత్రం టైంకి రాకుండా లేటుగా రావడం. ప్రొద్దున్న లేచిందగ్గర్నుంచీ రాత్రి పడుకునేవరకూ నాదో టైం టేబులట. తను చెబితేనే నాకు తెలిసింది. ఆలోచనలనుంచీ రైల్వేస్టేషన్నుంచీ ఒకేసారి బయటపడ్డాడు రఘు.

ఎదురుగా ఉన్న ఆంధ్రహోటల్కెళ్లి టిఫిన్ చేసి ఇంటికి బయలుదేరాడు. ఓ నెలా పదిహేనురోజులు అదే రాజీ తిరిగి వచ్చేవరకూ తనదో డిఫరెంట్ లైఫ్. ఆ డిఫరెంట్ లైఫ్ను గురించి ఆలోచించుకుంటూ తనలోతనే చిన్నగా నవ్వుకున్నాడు గర్వంగా.

* * *

అది జూన్ నెల మొదటివారం. వేసవి సెలవులు అయిపోవచ్చాయి. రఘు తనకి ఆఫీసులో తీరిక లేకపోవడంతో రాజీని పిల్లల్నీ పంపమని తన మావగారికి ఉత్తరం రాశాడు.

ఓరోజు పరశురామ్ రఘు ఇంటికి వచ్చాడు అప్పటికి రాజీ ఇంకా తిరిగిరాలేదు. రఘు బలవంతం చేయడంతో ఆరోజుకి రఘు దగ్గరే ఉండిపోయాడు పరశురామ్. రఘు వంటచేశాడు. ఇద్దరూ భోజనాలు ముగించారు.

"ఏరా రఘు ఈసెలవుల్లో నీ ఎంజాయ్మెంట్ ప్రోగ్రాం ఎలా ఉందిరా! ఏవో చాలా చాలా చెప్పావుగా. సినిమాలనీ, షికార్లనీ, బీట్లనీ వగైరా ఎంతవరకూ తీర్చుకున్నావేమిటి నీ కోరికలు" అన్నాడు పరశురామ్.

"నువ్వు రాజీకి చెప్పకుండా ఉంటానంటే నీకో విషయం చెప్పాలిరా!"

"ఏంటదీ!" ఆసక్తిగా అడిగాడు పరశురామ్.

"ఇదిగో ఈ పుస్తకాలు చూశావుగా!" షెల్ఫ్లో ఉన్న పుస్తకాల్ని చూపిస్తూ "ఇవే నా ఎంజాయ్మెంట్. నాకిష్టమయిన సాహిత్యం సాధ్యమైనంతవరకూ ముగించాను" తృప్తిగా చూస్తూ చెప్పాడు రఘు.

"మరి ఆ సినిమాలూ, షికార్లూ వగైరా!?"

"ఛఛ! ఆ సినిమాలేం చూస్తాంరా! ఏదో ఓ సినిమా చూశాలే! తలపోటొచ్చింది"

"మరి రాజీతో అలా చెప్పేవేరా! తనుకొంచెం బాధపడింది కూడా"

"రాజీని బాధపెట్టడం నా ఉద్దేశ్యం కాదురా! సంవత్సరమంతా భర్తకీ, పిల్లలకీ సేవచేసి తనెంత కష్టపడుతోంది చెప్పు. మనం ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నాం. మనకెన్ని సెలవులున్నాయి సంవత్సరంలో. ఆదివారాలనీ, శనివారాలనీ, పండుగలనీ, పబ్బాలనీ, ఆర్జితసెలవులనీ, క్యాజువల్ లీవ్ అనీ, ఎవడైనా ఛస్తే సెలవు, బ్రతికితే సెలవు...ఇవన్నీ కలుపుకుని సుమారు నాలుగునెలలుపైనే మనం సెలవులు తీసుకుంటున్నాం"

"అబ్బా! అన్నిరోజులు మనం పనిచేయడం లేదన్నమాట. ఎప్పుడూ పెద్దగా ఆలోచించలేదు నేను ఈ విషయం మీద" సాలోచనగా అన్నాడు పరశురామ్.

"మరి రాజీకి సెలవులేవీ? అందుకే రాజీని వాళ్ల ఊరికి వెళ్ళేలా రెచ్చగొట్టాను. నేను ప్లెయిన్గా చెబితే తాను వెళ్లదు"

"ఎందుకనీ?"

"నన్ను మా ఆయన బంగారం అనుకుంటూ, ఈ బంగారం మొగుడుగారు కష్టపడకూడదు అనుకుంటూ ఆమె మరింత కష్టపడడం మొదలుపెడుతుంది. అదో అతి ప్రేమా అమాయకత్వమూను. అందుకే తన వీక్నెస్ను ఆధారం చేసుకుని తన అహం మీద చిన్నగా ఓ సవాల్ విసిరి నా మీద ఓ చిన్నపాటి అలక వహింపచేసి ఊరికి పంపాను. ఈ నెలా పదిహేనురోజులైనా తను ఏ టెన్షనూ లేకుండా రిలీఫ్గా గడపగలిగితే అంతకన్నా నాకు కావలసింది ఏముంది?"

"ఒరేయ్ నువ్వు చాలా విశాల హృదయం కలవాడివిరా! చిన్ననాటి స్నేహితుడివైనా నిన్ను పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను" బరువెక్కిన హృదయంలోంచి వచ్చాయి పరశురామ్ మాటలు.

"ఇందులో పెద్ద విశాలహృదయమేమీలేదురా! వర్క్స్పాట్నించి, రొటీన్లైఫ్నించీ ప్రతివాళ్లకీ కాస్త మార్పు అవసరమనే సింపుల్ లాజిక్ అంతే!"

"మంచిది. కానీ నువ్వు వల్లించిన షికార్లూ, బీట్లూ వగైరా ఆమెకు బాధకలిగిస్తాయేమో! ఆమెకు విషయం అర్థమయ్యేట్టు చెప్పరా!"

"సమయమొచ్చినప్పుడు చెబుతానులే! లేకపోతే రాజీ ఎప్పుడో ఒకప్పుడు నా భరతం పట్టినాపట్టొచ్చు" అన్నాడు రఘు నవ్వుతూ.

★

## డయాబెటిస్

'కాఫీలో షుగర్ నీకెందుకురా! ఒంట్లోనే షుగర్ ఫ్యాక్టరీ పెట్టేశావుగా!' సుబ్బారావు ఫ్రెండ్తో జోకేశాడు. అసలు 'డయాబెటిస్' అంటే ఏమిటంటే శరీరకణాలకి అవసరమయ్యే శక్తి గ్లూకోజ్ ద్వారా సమకూరుతుంది. మనం తినే ఆహారం జీర్ణమయ్యాక గ్లూకోజ్లా మారుతుంది. ఈ గ్లూకోజ్ రక్తప్రసరణలో ప్రవేశించి వివిధ శరీరకణాలకి సరఫరా అవుతుంది. పేంక్రియాస్ గ్రంధి స్రవించబడే ఇన్సులిన్ అనే హార్మోన్ గ్లూకోజ్ను శరీరకణాలకి చేరవేస్తుంది. అంటే ఇన్సులిన్ ఒక తాళం చెవిలా శరీరకణ ద్వారాన్ని తెరిచి గ్లూకోజ్ని లోపలికి పంపుతుంది. ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గిపోతే గ్లూకోజ్ శరీరకణాలలోకి ప్రవేశించలేదు. ఇలా రక్తంలో గ్లూకోజ్ నిల్వ ఉండడాన్నే 'డయాబెటిస్' (మధుమేహవ్యాధి) అంటారు.

## కలలు కందామా!

మన జీవితంలో మూడింట ఒకభాగం నిద్రలోనే గడుపుతాం. సుమారు ఆరుసంవత్సరాలు నిద్రలో కలలు కంటుంటాం. నిద్రలో కలలు 1-2గంటలు వస్తాయి. కల పూర్తయిన ఐదునిముషాల తర్వాత సగం కలని, పదినిముషాల తర్వాత తొంభైశాతం కలని మర్చిపోతుంటాం. మెదడులో తరంగాలు మనం మెళకువగా ఉన్నప్పటికంటే కలలుగనే టైంలోనే ఎక్కువ శక్తివంతంగా పనిచేస్తాయట. అంధులకు కూడా కలలు వస్తుంటాయట. పుట్టుకతో అంధత్వం ఉన్నవాళ్ళు మధ్యలో అంధత్వం వచ్చినవాళ్ళు ఇలా వారి వారి అంధత్వాన్ని బట్టి వాళ్ల కలలు, దృశ్యాలు వస్తుంటాయి.

-యం.వెంకటేశ్వరరావు

